క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

ఎడపల్లి(బోధన్): పరిమితికి మించి మద్యం తాగి వాహనాన్ని నడిపిన ఏఆర్‌పీ క్యాంప్‌నకు చెందిన ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ బోధన్ మేజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పును ఇచ్చారు. అదే విధంగా ఎడపల్లి అంగన్‌వాడి సెంటర్‌లో ధూమ పానం చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం ఉదయం స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా సోషల్ సర్వీస్ కోర్టు ఆవరణలో ఉన్న చెట్లకి నీళ్లు పోయాలని తీర్పు వెల్లడించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదానం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చే ప్రజల కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ వికాస్ మహతో ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రిజిస్ట్రేషన్ కోసం తహసీల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విఠల్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వరుణ్, ఇస్కాన్ ప్రతినిధులు అశోక్ ఆత్మ నిత్యాయుదాస్, కేశవ ప్రభు, యాదవ ప్రభు, నర్సింలు ప్రభు, రాధిక, కృష్ణ ప్రభులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



మాక్లూర్ : అడవి మామిడిపల్లిలో శుక్రవారం ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. టోర్నీ చైర్మన్ భూపతి రాజేశ్వర్ ఆధ్వర్యంలో జరిగే టోర్నమెంట్‌లో ఆడేందుకై ఆసక్తి ఉన్న ఆయా గ్రామాల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకుని హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. అలాగే అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులుంటాయని తెలిపారు. రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు భూపతిప్రభు, మాజీ సర్పంచ్ చింత మల్లారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు డీసీ గంగారాం, సభ్యులు కె ప్రదీప్, బి రవి, రాజు, టి.చిరంజీవి, కె.శివకుమార్, ఎం.గంగాధర్, టి.బంటి, డి.చిరంజీవి, పుణ్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



మాక్లూర్ : గొట్టిముక్కలలో శుక్రవారం మండల పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో 393 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ప్రతి వేసవిలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల వారిగా ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కిరణ్‌కుమార్ దేశ్‌పాండే ఈ సందర్భంగా తెలిపారు. వైద్యసిబ్బంది టి.వినిత, బి.శ్యామల, అహ్మద్‌పాష, సుధీర్, పుష్ప, కల్యాణి, గంగాధర్, సికిందర్, బేగ్, పశువు పెంపకందారులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని పోచమ్మ కాలనీ సమీపంలో ఆర్మూర్ ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో శుక్రవారం పశువులకు, గే దెలకు గాలికుంటు టీకాలు వేశారు. డాక్టర్ రోహిత్‌రెడ్డి పశువులకు వేస్తున్న గాలికుంటు టీకాలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పశువులకు ఏమైన వ్యాధులు వస్తే వెంటనే సమీప పశు వైద్యశాలను సంప్రదించి చికిత్స అందించాలన్నారు. ఏరియా ఆస్పత్రి డాక్టర్ మహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పునర్విభజన

- మోర్తాడ్ మండలంలో కొనసాగిన రామన్నపేట్.. వేల్పూర్ మండలంలో విలీనం
- రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇతర శాఖల సేవలు వేల్పూర్ మండలంలో..
- పోలీసు, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల సేవలు పాత మండలంలోనే..
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



రామన్నపేట్ గ్రామం

మోర్తాడ్: మండలాల పునర్విభజన జరిగి ఎనిమిదేళ్లు అవుతున్నా రామన్నపేట్ గ్రామ సమస్యకు ప్రభుత్వాలు ఇంకా పరిష్కారం చూపలేకపోయాయి. 2016లో మండలాల పునర్విభజనలో భాగంగా అప్పటి వరకు మోర్తాడ్ మండలంలో కొనసాగిన రామన్నపేట్‌ను వేల్పూర్ మండలంలో విలీనం చేశారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్య, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి శాఖల సేవలు అన్నీ వేల్పూర్ మండలంలోనే అందుకుంటున్న రామన్నపేట్‌వాసులు మూడు కీలక శాఖలకు సంబంధించి ఇంకా మోర్తాడ్ మండలంపైనే ఆధారపడి ఉన్నారు. రామన్నపేట్ ఇంకా మోర్తాడ్ పోలీసు స్టేషన్ పరిధిలోనే కొనసాగుతుంది.

వైద్య ఆరోగ్య శాఖ సబ్ సెంటర్ కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొనసాగుతుంది. మోర్తాడ్‌లో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటైన తరువాత ఈ మండలం పరిధిలోని వారికి వైద్య సేవలు కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి పీహెచ్‌సీల ద్వారా అందుతున్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించి పునర్విభజన జరగకపోవడంతో మోర్తాడ్ సెక్షన్ పరిధిలోనే రామన్నపేట్ సబ్‌స్టేషన్ కొనసాగుతుంది. మండలాల పునర్విభజన జరిగిన సమయంలోనే అన్ని శాఖల విభజన కూడా పూర్తి కావాల్సి ఉంది. అప్పటి ప్రజాప్రతినిధులకు అవగాహన లేకపోవడం, అధికారులకు పట్టింపు లేకపోవడంతో రామన్నపేట్ గ్రామస్తులు కొన్ని సేవల కోసం వేల్పూర్ మండలానికి, మరికొన్ని సేవల కోసం మోర్తాడ్ మండలానికి వెళ్లాల్సి వస్తోంది. తమ గ్రామాన్ని వేల్పూర్ మండలంలో విలీనం చేయడం ఇష్టం లేదని అప్పట్లోనే గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

మోర్తాడ్‌లో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఆరు గ్రామాలతో ఏర్గట్ల మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేశారు. 10 గ్రామ పంచాయతీల తో మోర్తాడ్‌ను చిన్న మండలంగా మార్చి, రామన్నపేట్‌ను వేల్పూర్ మండలంలో విలీనం చేశారు. ప్రజల అభీష్టానికి విరుద్ధంగా రామన్నపేట్‌ను మరో మండలంలో విలీనం చేసినా అన్ని శాఖలను పునర్విభజన చేయకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి నాయకులు ఎలాగూ పట్టించుకోలేదు.. కనీసం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని పూర్తి స్థాయిలో పునర్విభజన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మా కష్టాలను నేతలు గుర్తించలేదు

రామన్నపేట్‌ను వేల్పూర్‌లో విలీనం చేశారు. అప్పట్లో మా ఆందోళన పెడచెవిన పెట్టారు. కానీ మా గ్రామ ప్రజల కష్టాలను గుర్తించే నాయకులు లేకపోవడంతో పునర్విభజన సగం సగమే జరిగింది. గతంలోని నాయకులకు ప్రజల కష్టాలు తెలిసి ఉంటే అన్ని శాఖల సేవలను వేల్పూర్ మండలంలోనే కొనసాగించేలా చేసేవారు. నాయకులకు వారి పదవులే ముఖ్యం. ప్రజల ఇబ్బందులు అవసరం లేదు. అందుకే మా పరిస్థితి ఇలా ఉంది.

– ఎం.గంగాధర్, రామన్నపేట్‌వాసి

సమాచారం లేకుండా సమావేశాలా?

- ఏపీఎం తీరుపై మహిళా సంఘాల అసంతృప్తి

రెంజల్(బోధన్): వీవోలకు సమాచారం లేకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారని మహిళా సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఏపీఎం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెంజల్‌లోని మండల మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం ఏపీఎం చిన్నయ్య మహాజనసభ నిర్వహించారు. సమావేశానికి రెంజల్‌లోని ప్రగతి వీవోకు సమాచారం అందించలేదని అధ్యక్షురాలు సిరిగాద లక్ష్మీ ఆరోపించారు.

మండలంలోని 31 వీవోలకు సమాచారం అందించి మహాజన సభ నిర్వహించాల్సి ఉండగా కొందరికి ఎలాంటి సమాచారం అందించలేదని వాపోయారు. ఏపీఎం.. వీవోలను చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. ఈ విషయమై ఏపీఎంను వివరణ కోరగా ప్రతీ వీవోకు సమాచారం అందించామని అన్నారు.

దేశంలో మతసామరస్యాన్ని కాపాడుకోవాలి



నందిపేటలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నందిపేట్ (ఆర్మూర్): జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ నందిపేట మండల కేంద్రంలో ముస్లింలు శుక్రవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు, నాయకులు మాట్లాడుతూ.. దేశంలో మతసామరస్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న ఉగ్రవాదాన్ని సమూలంగా అంతమొందించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లిం వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసి, ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ముస్లిం కమిటీ అధ్యక్షుడు అహ్మద్ ఖాన్, అన్ని మసీదుల అధ్యక్షులు, కాంగ్రెస్ ముస్లిం నాయకులు జమీల్, ఇసుబ్, ఖదీర్, జావీద్, బీఆర్‌ఎస్ ముస్లిం నేతలు సయ్యద్ హుస్సేన్, పాషా, హుస్సొద్దిన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, మాజీ ఎంపీటీసీ సిలిందర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపేయాలి

బోధన్ : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత లక్ష్యంతో పూనుకున్న ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలకు ముందుకు రావాలనే డిమాండ్‌తో పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నేడు(శనివారం) సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ వేదిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కన్వీనర్ విజయ రామరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు ర్యాలీ కొనసాగనుందని పేర్కొన్నారు. ర్యాలీకి వేదిక సభ్యులు, శాంతిని కోరుకునే వారంతా తరలి రావాలని కోరారు.

సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నివారణపై అవగాహన



బోధన్‌రూరల్ : సాలూర మండలం హున్సలో శుక్రవారం గ్రామస్తులకు నిజామాబాద్ సైబర్ క్రైం, బోధన్ రూరల్ పోలీసులు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఓటీపీలు, యూపీఐ మోసాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్, ఉద్యోగాల పేరిట జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రొబెషనరీ ఎస్సై రమ, బోధన్ రూరల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఈ ముక్తార్, అధికారులు

- బోధన్ ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్

బోధన్‌రూరల్: విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా పనిచేయాలని బోధన్ ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బోధన్ టౌన్ –1, 2, బోధన్ రూరల్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి విద్యుత్ ప్రమాదాలపై, జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ మాట్లాడుతూ.. మరమ్మతులు, కొత్త పనులు చేసే సమయంలో అధికారులు, సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. లైన్ క్లియర్ తీసుకునే సమయంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తినా సంబంధిత ఏరియా విద్యుత్ సిబ్బందితోనే పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలన్నారు. ఏడీఈ నాగేష్ కుమార్, ఏఈలు నాయిని కృష్ణ, కల్యాణ్, సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



మోర్తాడ్ : భీమ్‌గల్ మండలం మెండోరాలో పెద్దమ్మ తల్లి ఆలయం 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.సంఘం అధ్యక్షుడు హరిదాసు, కార్యవర్గ సభ్యులు కొమ్మేటి గంగయ్య, చిట్యాల రమేష్, ఈర్ల పోశన్న, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పురోగతి పరిశీలన



పెంటాకుర్దులో పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్



జాన్కంపేట్‌లో పరిశీలిస్తున్న ఎంపీవో సాయిలు

బోధన్‌రూరల్: పెంటకుర్దులో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని బోధన సబ్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. శుక్రవారంలో గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపికైన లబ్ధిదారుల స్థలాలను పరిశీలించారు. ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీవో మధుకర్, స్థానిక అధికారులు, నాయకులు ఉన్నారు.

వేల్పూర్ పరిధిలో..

వేల్పూర్ : జాన్కంపేట్, కొత్తపల్లి ఎస్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను ఎంపీవో సాయిలు శుక్రవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు నిర్మించుకోడానికి స్థలం ఉందా లేదా ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇళ్ల స్థలాలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

కార్యవర్గం ఎన్నిక..

మోర్తాడ్ మండల సమాఖ్య కార్యవర్గం..



మోర్తాడ్ : మోర్తాడ్ మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా ఎర్రోజి లత(దొన్కల్), కార్యదర్శిగా లావణ్య(సుంకెట్), కోశాధికారిగా వరలక్ష్మి(మోర్తాడ్)లను ఎంపిక చేశారు. సీసీ తడకల శ్రీనివాస్ నూతన కార్యవర్గ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డీపీఎం మారుతి, ఏపీఎం ప్రమీల, సీసీలు తడపాకల మహేందర్, గాజుల శ్రీనివాస్, రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూర్ మహిళా సమాఖ్య..

వేల్పూర్: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జరిగిన మహిళా సమాఖ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరోజిని, ఉపాధ్యక్షురాలిగా లలిత, కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా లక్ష్మి, సహాయకార్యదర్శిగా మౌనికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి ముందు మండల మహిళా సమాఖ్య వార్షిక సమావేశం నిర్వహించారు. వార్షిక నివేదిక, జమ, ఖర్చులు వెల్లడించారు. ఏపీఎం మాణిక్యం, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



రుద్రూర్: కోటగిరి మండల గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నూతన కమిటీని శుక్రవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలుగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా లింగం, కోశాధికారిగా జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా పోశెట్టి, శేఖర్, సహాయ కార్యదర్శులుగా రజిని, చాందీబాయి, కార్యవర్గ సభ్యులుగా లింగవ్వ, ఎల్లయ్య ఎన్నికయ్యారు. అనంతరం నన్నేసాబ్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం నూతన కమిటీ సభ్యులు రాజీలేని పోరాటాలు చేయాలని సూచించారు

పొతంగల్ బీజేపీ అధ్యక్షుడిగా హన్మాండ్లు



రుద్రూర్: పొతంగల్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కల్లూరి హన్మాండ్లు అలియాస్ బజరంగ్ హన్మండ్లును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. పార్టీపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని, మండలంలో పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



దొంకేశ్వర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు



పొతంగల్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈవో లోల శంకర్



ప్రతిభ కనబర్చిన ఆర్మూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈవో రాజగంగారాం, కమిషనర్ రాజు

ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం సన్మానించారు. వీడీసీ, ప్రజాప్రతినిధులు, ఎంఈవోలు హాజరై విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. భవిష్యత్తులో విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



చిన్నాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రాయల స్నేహితను సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ



రుద్రూర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న విండో చైర్మన్ బద్దం సంజీవ్ రెడ్డి, రైడ్స్ సభ్యులు

సినిమాలు	
పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)	
స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

విద్యార్థులకు నగదు పురస్కారం



వేల్పూర్: పడగల్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ ఫలితాలలో 500లకు పైగా మార్కులు పొందిన విద్యార్థులను గ్రామానికి చెందిన రవీందర్‌యాదవ్ శుక్రవారం నగదు పురస్కారంతో సన్మానించారు. 550 మార్కులు పొందిన జి. అలోకకు రూ. 2 వేలు, 545 మార్కులు పొందిన కిరణ్‌కు రూ. 1500, 541 మార్కులు పొందిన సుశాంత్‌కు వేయి రూపాయల నగదు బహుమతి అందించి, శాలువాతో సన్మానించారు. వీరితో పాటు 500 లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సైతం సన్మానించారు. గత నాలుగేళ్లుగా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తున్నానని, వచ్చే ఏడాది కూడా నగదు పురస్కారం అందజేస్తానని రవీందర్‌యాదవ్ వెల్లడించారు. హెచ్‌ఎం రాంచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూరులో..



నగదు, శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): పదో తరగతి పరీక్ష ఫలితా ల్లో ఆలూర్ మండలంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ శుక్రవారం నగ దు ప్రోత్సాహకాలు అందజేశారు. తహసీల్దా ర్ రమేష్, ఎంఈవో నరేందర్, ఆర్‌ఐ రేణుక, వీడీసీ అధ్యక్షుడు ముత్యం పాల్గొన్నారు.